క్లుప్తంగా...

కొనసాగుతున్న 100 రోజుల కార్యక్రమం



ఎన్‌టీఆర్‌నగర్‌లో చేపట్టిన సర్వేలో పాల్గొన్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రతి రోజు సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల నుంచి ఒక కాలనీ, బస్తీలను ఎంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, రెవెన్యూతో పాటు విద్యుత్ శాఖ, జలమండలి, మండల రెవెన్యూ, పోలీసు తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఎంపిక చేసిన కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను నమోదు చేసుకుంటున్నారు. మంగళవారం అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగింది.

బండ్లగూడలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండ్లగూడ గ్రామంలో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గ్రామంలోని మసీదు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను అందరూ ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి వాహనం అందజేత

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డాక్టోరల్ పరిశోధక విద్యార్థి హర్ష్‌రాజ్‌కు త్రీవీలర్‌ను మంగళవారం డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్(ఈసీడీఏపీ) ఎంపవర్డ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రామస్వామి అందించారు. ఈసీడీఏపీ అనేది హెచ్‌సీయూలో దివ్యాంగ విద్యార్థులు, సిబ్బంది యొక్క ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన విభాగం. ఇప్పటికే మూడు చక్రాల స్కూటర్, బ్యాటరీ వీల్‌చైర్‌ను కొనుగోలు చేసింది. ఈ వాహనాలు క్యాంపస్‌లో లోకో మోటర్ వైకల్యాలున్న విద్యార్థులకు అందజేస్తారు .

జేఎన్‌వీలో 'పారా స్పోర్ట్స్' సెలక్షన్స్

- క్రీడా పోటీలను ప్రారంభించిన డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ



పోటీల ప్రారంభ వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ

రాయదుర్గం: క్రీడాకారుల సందడితో గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణం కళకళలాడింది. దేశంలోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదివే దివ్యాంగ క్రీడాకారులంతా ఇక్కడ నిర్వహిస్తున్న దివ్యాంగ క్రీడాకారుల 'పారా స్పోర్ట్స్ సెలక్షన్స్‌లో పాల్గొంటున్నారు. ఈ పోటీలను జవహర్ నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్, ఆదిత్య మెహతా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నారు. జేఎన్‌వి ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ ఆధ్వర్యంలో సాగే ఈ పోటీలను నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు.

వారం రోజులూ సందడే..

ఈ క్రీడా పోటీలలో వరంగల్, గుంటూరు, బెంగళూరు, దార్వాడ్, యాదగిరి, తివేంద్రం, త్రిసూర్, వైజాగ్, విజయవాడ, హైదరాబాద్, సికింద్రాబాద్ క్లస్టర్‌కు చెందిన 150 మంది బాలురు, 80 మంది బాలికలు పాల్గొంటున్నారు.స్విమ్మింగ్, సైక్లింగ్, పవర్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, తైక్వాండో పోటీలు నిర్వహిస్తారు. పోటీలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులకు త్రీవీలర్స్‌ను గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ పర్యవేక్షణలో అందించారు.



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

బెట్టింగ్ ముఠాల ఆటకట్టు

- నలుగురు నిందితుల అరెస్ట్
- రూ.59.50 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: ఫామ్‌హౌస్, లాడ్జీలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, మైలార్‌దేవ్‌పల్లి, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.59.50 లక్షల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్, క్రికెట్ స్కోర్ వేసేందుకు వినియోగించే పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసులో ప్రధాన నిందితుడితో పాటు మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ సాధన రేష్మీ, రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సురంగల్ గ్రామంలో కొత్తగా నిర్మించిన ఫామ్‌హౌస్‌ను కుకట్‌పల్లి ప్రాంతానికి చెందిన శంకర్ లీజుకు తీసుకున్నాడు. సోమవారం చెన్నయ్ సూపర్‌కింగ్స్, ఆర్‌సీబీల మధ్య జరుగుతున్న ఐపీఎల్ టి–20 మ్యాచ్‌కు సంబందించి కుకట్‌పల్లి సుమిత్రానగర్‌కు చెందిన తిరుపతయ్య, ఓల్డ్ అల్వాల్‌కు చెందిన పి.నాగరాజు, మల్లారెడ్డితో కలిసి బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, మొయినాబాద్ పోలీసులు దాడులు నిర్వహించారు. తిరుపతయ్య, నాగరాజు, మల్లారెడ్డిని అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిందితుడు శంకర్, భాస్కర్, సిద్దు, మల్లి, సాయిరెడ్డి, భాషా పరారయ్యారు. వారి నుంచి ట్యాబ్, ఆరు సెల్‌ఫోన్లు, రూ.40 లక్షల నగదు, రూ.12 లక్షల బ్యాంక్ ఖాతాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న నగదు పరిశీలిస్తున్న డీసీపీ

లాడ్జీలో బెట్టింగ్ నిర్వహిస్తూ

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ అమన్ లాడ్జీలో కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన బలుసు సతీష్ సోమవారం ఉదయం గదిని అద్దెకు తీసుకున్నాడు. చెన్నై, ఆర్‌సీబీల మధ్య క్రికెట్ మ్యాచ్‌కు సంబందించి ఆన్‌లైన్‌లో తన సెల్‌ఫోన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు లాడ్జీపై దాడి చేసి సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.6.40 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రగతి నగర్‌కు చెందిన మరో నిందితుడు రవితేజ పరారీలో ఉన్నట్లు డీసీపీ వెల్లడించారు. ఈ రెండు కేసుల్లో ప్రతిభ చూపిన మొయినాబాద్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులతో పాటు ఎస్‌ఓటీ పోలీసులను అభినందిస్తూ నగదు బహుమతులను అందజేశారు.



పోలీసుల అదుపులో నిందితులు

బెట్టింగ్‌పై సమాచారం అందించండి...

ప్రస్తుతం ఐపీఎల్ టి–20 క్రికెట్ పోటీల నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. బెట్టింగ్‌లో సర్వస్వం కోల్పోయి ఎందరో రోడ్డున పడ్డారన్నారు. బెట్టింగ్‌లపై స్థానిక పోలీసులకు ఎప్పటికప్పుడు అందించాలన్నారు.

పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు...

మైలార్‌దేవ్‌పల్లి, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడ్డ నిందితుల వివరాలను సేకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. గతంలో వీరు బెట్టింగ్‌లకు పాల్పడినట్లు గుర్తిస్తే పీడీ యాక్టు నమోదుకు సిఫార్సు చేస్తామన్నారు.

కార్యకర్తలు కష్టపడి పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ మెజార్టీ లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని తన నివాసంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 25న జరిగే నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదని, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఐదు డివిజన్లకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

శంషాబాద్: కంటి వెలుగు వైద్యశిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. స్థానిక 21 వార్డులో కౌన్సిలర్ అజయ్‌తో కలిసి మంగళవారం ఆమె వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఆరోగ్య తెలంగాణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలు కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి మార్కెట్ ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్ అజయ్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాజేంద్రనగర్: ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. మంగళవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామన్నారు. అధికారులతో సమావేశాలను ఏర్పాటు చేస్తూ ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, మంచినీరు తదితర సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.



అత్తాపూర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీశంకర్

కార్యక్రమంలో నాయకులు బీట్యాకరి సిద్దేశ్వర్, అధికారులు నరహరి, శానిటేషన్ సూపర్‌వైజర్ కృష్ణకిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, చెన్నయ్య, ఎస్‌ఎఫ్‌ఏలు రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బీభత్సం

- గుడిసెలోకి దూసుకెళ్లిన వైనం
- బ్రేక్‌లు ఫెయిల్ కావడమే కారణం
- ముగ్గురికి గాయాలు

మణికొండ: జలమండలి వాటర్ ట్యాంకర్ మణికొండ క్వార్టర్స్‌లో సోమవారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. రివర్స్‌లో వస్తున్న ట్యాంకర్ బ్రేకులు ఫెయిల్ కావటంతో ఓ గుడిసెలోకి దూసుకెళ్లిం. దీంతో గుడిసెలో ఉన్న ఓ గర్భిణితో పాటు, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మణికొండ క్వార్టర్స్‌లోని ఓ ఇంటికి నీటిని సరఫరా చేసేందుకు వచ్చిన ట్యాంకర్ రివర్స్ తీస్తుండగా బ్రేక్‌లు ఫెయిలయ్యాయి. దీంతో అదుపు తప్పిన ట్యాంకర్ వెనక ఉన్న గుడిసెలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో గుడిసెలో నివాసం ఉంటున్న గర్భిణి దేవి, ఆమె కుమార్తెలు మోక్షిత, సాయిశ్రీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



గుడిసెలోకి దూసుకెళ్లిన వాటర్ ట్యాంకర్

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని జాతీయ రహదారి నుంచి రైల్వేకమాన్ వరకు రోడ్డును విస్తరించి మధ్యలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వేకమాన్ వరకు పూర్తి చేసిన రహదారి ప్రయాణికులకు రాకపోకలకు అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్ గుప్తా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

మణికొండ: ఇటీవలి కాలంలో అకస్మాత్తుగా వస్తున్న కార్డియాక్ అరెస్ట్‌లను ఎదుర్కొన్న వారిని సకాలంలో కాపాడేందుకు కార్డియోపల్మనరీ రీసటేషన్(సీపీఆర్)పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సీబీఐటీ, ఎంజీఐటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.రవీందర్ రెడ్డి, ప్రొఫెసర్ జి. చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గండిపేటలోని ఆయా కళాశాల్లో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో సీపీఆర్‌లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఆర్ అనేది కార్డియాక్ అరెస్ట్‌ను ఎదుర్కొంటున్న , ఊపిరి పీల్చటంలో ఇబ్బందులు పడుతున్న వ్యక్తులను తిరిగి పునరుద్ధరించటానికి లైఫ్ సేవింగ్ టెక్నిక్‌గా ఉపయోగపడుతుందన్నారు. గుండె పై భాగంలో ఉండే స్టెర్నమ్ అనే ఎముక వద్ద ప్రెషర్ ఇచ్చి, గుండెను స్టిమ్యులేట్ చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కువ ప్రెషర్ ఇస్తే ఎముక విరిగే అవకాశం ఉందని, అలాగని వీక్‌గా చేస్తే ప్రెషర్ సరిపోదన్నారు. ఒక మోతాదులో చేయటాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకుని ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇది ప్రథమ చికిత్సలాంటిదని, ప్రాణాలను నిలుపుతుందని , ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్‌శర్మ, బాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

రాజేంద్రనగర్: రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీక అని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం సులేమాన్‌నగర్‌లోని మసీదు వద్ద డివిజన్ అధ్యక్షుడు సయీం, మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ముస్లిం పేదలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ముస్లిం మైనార్టీలకు అధిక ప్రాధాన్యత దక్కిందన్నారు. మసీదులు, ఈద్గాలు, దర్గాలు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనల్లో శాంతియుత వాతావరణంలో అభివృద్ధి సాగుతుందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే రకమైన సోదర భావాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నవీన్, ముస్లిం పేదలు, మైనార్టీ ప్రజలు పాల్గొన్నారు.



రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

హెచ్‌సీయూ విద్యార్థికి అంతర్జాతీయ గుర్తింపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధక విద్యార్థి కిరణ్‌కుమార్‌గౌడ్ గ్లోబల్ సౌత్ పాలసీ ప్రాసెస్ రీసెర్చ్ నెట్‌వర్క్ (జీసీపీపీఆర్‌ఎన్) స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యాడు. ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ పబ్లిక్ పాలసీ అసోసియేషన్ (ఐపీపీఏ) కింద ఈ నెట్‌వర్క్ పనిచేస్తుంది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఆసియా, సౌత్ఆఫ్రికా, సౌత్ అమెరికా వంటి ప్రాంతాలలో పబ్లిక్ పాలసీ పనితీరు, అమలు చేస్తున్న విధానాలను పరిశోధనలు జరుగుతాయన్నారు.

సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలి

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ను సమస్యలు లేని ప్రాంతంగా మార్చడంలో అధికారులు కృషి చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. 100 రోజుల కార్యక్రమాన్ని పురస్కరించుకొని జలమండలి, జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజీ, శానిటేషన్, ఆరోగ్యశాఖ, విద్యుత్, యూబీడీ విభాగాల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గుల్‌మొహర్‌పార్కు, డాక్టర్స్‌కాలనీ, లక్ష్మీ విహార్‌ఫేజ్-1, ఫేజ్-2 కాలనీల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై ఆయన అధికారులతో చర్చించారు. కాలనీల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే బాధ్యత అధికారులదేనన్నారు. ముఖ్యంగా గచ్చిబౌలి డివిజన్‌లో శానిటేషన్ సమస్య రాకుండా చూడాలన్నారు. విద్యుత్ తీగలు సరి చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు వేయడం, అవసరమున్న చోట స్తంభాలు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, ఇళ్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుడదన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ రాజశేఖర్, జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, ఎల్ఓ కృష్ణ, యూబీడీ మేనేజర్ యూసుఫ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది భరత్‌రెడ్డి, రఘు, రాజేష్, యాదవ్, అనీల్, కృష్ణ, శ్రీనివాస్, గోపాల్,ప్రసాద్, నాయకులు హన్మంతునాయక్, కిషన్, హరీష్ శంకర్, తిరుపతి, రమేష్, ప్రభాకర్, శేఖర్ ,కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్సోఫీ ఎదుట విద్యార్థుల ఆందోళన

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని ఇన్సోఫీ డేటా సైన్స్ ట్రైనింగ్ సెంటర్ ఎదుట ఆ సంస్థలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. బ్యాంక్ లోన్ తీసుకొని డేటా సైన్స్‌లో శిక్షణ తీసుకునేందుకు 9 నెలల కోర్సులో చేరామని బాధితులు తెలిపారు. ఇంటర్న్‌షిప్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తమను తొలగిస్తున్నామని మెయిల్ పంపడంతో ఏం చేయాలో అర్థం కాక ఆందోళనకు దిగినట్టు బాధితులు వాపోయారు.

అందరికీ సర్టిఫికెట్లు

డేటా సైన్స్ ట్రైనింగ్‌లో చేరిన వారు బ్యాంకు లోన్ ద్వారా ఫీజులు చెల్లించారు. బ్యాంక్ ఈఎంఐ కోసం ప్రతి నెల స్టైఫండ్ ఇస్తున్నట్టు ఇన్సోఫీ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ దక్షిణామూర్తి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ రాకపోవడంతో బ్యాంక్ లోన్‌ను తామే భరిస్తున్నామని, శిక్షణ తీసుకుంటున్న 700 మంది విద్యార్థులకు లోన్ ఉందని అందరికి బ్యాంక్‌లోన్ తీర్చినట్టు ఎన్‌ఓసీ ఇస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కారణంగా ప్రాజెక్టులు రాకపోవడంతో ప్లేస్‌మెంట్ ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు డేటాసైన్స్ కోర్సు సర్టిఫికెట్, బ్యాంక్ లోన్‌ను తామే చెల్లిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే 220 మందికి లోన్ చెల్లించామన్నారు. కాగా ఆందోళన విషయం తెలిసి రాయదుర్గం పోలీసులు సంస్థ వద్దకు వెళ్లి ఆరా తీశారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ మహేష్ తెలిపారు.



డేటాసైన్స్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు